# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## రేవంత్‌రెడ్డికి రైతుల సోయి లేదు..

దంతాలపల్లి: కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి అధికార యావే తప్ప.. రైతుల సోయి లేదు. 3 గంటల కరెంట్ చాలనడం దారుణం. అసలు ఆ మాట నోటికి ఎలా వచ్చింది? రైతు బిడ్డ అయితే అలా మాట్లాడడు. ప్రజలు వాళ్లను నమ్మడం లేదని ఏవేవో మాట్లాడుతున్నడు. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో వానకాలం, యాసంగి పంటలు మంచిగ పండించుకుంటున్నం. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి భయంకరంగా ఉండేది. కరెంటు కోసం రాత్రిళ్లు పొలాల కాడ జాగారం చేసేటోళ్లు. ఇప్పుడు ఆ బాధ లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం. రైతులకు మూడు గంటల కరెంట్ వద్దు.. 24 గంటల కరెంటే కావాలి. బీఆర్‌ఎస్ ప్రభుత్వామే రావాలి.

*– కొక్కు వెంకన్న, రైతు, దంతాలపల్లి*

## ఎవుసం తెలిస్తే మూడు గంటల ముచ్చట చెప్పరు..



బయ్యారం : ఎవుసం గురించి తెలిసినోళ్లు మూడు గంటల కరెంటు ముచ్చట చెప్పరు. పంటలకు పుష్కలంగా నీరు అందాలంటే కచ్చితంగా 24 గంటల కరెంటు కావాల్సిందే. ఎప్పుడు నీరు అవసరం ఉంటే అప్పుడు రైతులు మోటరు వేసుకొని నీరు పెట్టకుంటరు. కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి మూడు గంటలే చాలనడం అర్థరహితం. కరంట్ లేక చేను కాడ రైతులు కాపల ఉన్న రోజులు, విద్యుత్ షాక్, పాము కాటుతో అనేక మంది రైతులు చనిపోయిన పాత రోజులు ఇంకా గుర్తుకు ఉన్నాయి. అలాంటి రోజులు మళ్లీ రావద్దు. ఇక 10 హెచ్‌పీ మోటరు గురించి మాట్లాడేటోళ్లకు అవి వినియోగించాలంటే ఎంత ఖర్చు అవుతుందో తెలుసా..? రైతు భరించగలడా..? నీరు ఎంత ఉండాలో తెలుసా..? ఇష్టం వచ్చినట్లు మాట్లాడి రైతులను ఆగం చేయొద్దు. ఇప్పుడు 24 గంటల కరెంటు, రైతు బంధుతో ఇబ్బంది లేకుండా ఉన్నారు. కాంగ్రెస్ వస్తే రైతులకు మళ్లీ కష్టాలు తప్పవు.

*– నీలం భగవాన్, రైతు, గంధంపల్లి*

## కాంగ్రెస్ హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదు..



కొత్తగూడ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంక రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నయి. 24గంటల నాణ్యమైన విద్యుత్‌తో పాటు ప్రమాద బీమా, రైతు బంధు వంటి వాటితో రైతులందరం సంతోషంగా ఉన్నం. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదు. కేసీఆర్ పాలనలోనే గిరిజన రైతులకు మేలు జరుగుతున్నది. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నడు. వాళ్లు ఏమైనా నాగలి పట్టి పొలం దున్నిండ్రా ?. ఎకరం పొలం పారించడానికి 3 గంటల కరెంట్ ఏం సరిపోతుంది..? 10 హెచ్‌పీ మోటరు పెట్టుకునే స్థోమత రైతులకు ఉన్నదా? ఏమాత్రం ఆలోచన లేకుండా మాట్లాడితే ప్రజలు ఊరుకోరు. తరిమికొడుతరు. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో మేము మంచిగనే ఉన్నాం. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే. బీఆర్‌ఎస్ పార్టీకే మా ఓటు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలె.

*–బానోత్ నెహ్రూ, రైతు, ముస్మీ, కొత్తగూడ*

## కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే..



మరిపెడ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కరెంట్ కోతలతో గోస పడ్డం. ఆ రోజు ఇంకా మరిచిపోలె. కరెంటు కోసం అర్ధరాత్రి పూట పొలాల వద్ద పడుకునే దుస్థితి ఉండేది. లో ఓల్టేజీ సమస్యతో తరచూ వ్యవసాయ మోటర్లు కాలిపోయికు మెకానిక్‌ల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. అదునుకు నీళ్లందక పొలాలు ఎండిపోయేవి. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో పంట పొలాలకు ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పెట్టుకుంటానం. అన్నదాతలను అన్నీతానై చూసుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోమారు అధికారంలోకి వస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

*– గడ్డ శ్రీను, రైతు, ఎర్జర్ల*



## కాంగ్రెస్ వచ్చేది లేదు..సచ్చేది లేదు

డోర్నకల్ : కాంగ్రెస్ హయాంలో లో వోల్టేజీ, తరచూ వచ్చి పోయే కరెంట్‌తో మస్తు ఇబ్బందులు పడ్డం. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోయేవి. వాటి బాగు చేయించేందుకు మేమే పైసలేసుకునేటోళ్లం. ఎవుసం గురించి తెల్వకుండా రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు మాట్లాడి రైతులను ఆగం చేస్తుండు. కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతరు? ఎవరు ఓటేస్తారు? 10 హెచ్‌పీ మోటరు నడిపే రైతులు ఉన్నరా? ఇచ్చిన మూడు గంటల కరెంట్‌కు 10 హెచ్‌పీ మోటర్లు ఆన్‌చేస్తే ట్రాన్స్‌ఫార్మర్‌పేలిపోతది. ఈమాత్రం తెల్వదా రేవంత్‌రెడ్డికి. కాంగ్రెస్‌కు ఓటేస్తే మన బతుకులు చీకటైతయి. రైతులను ఆగం చేసేందుకు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నడు. మళ్లీ పాత రోజులొస్తయ్. జాగ్రత్త. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటలు కరెంట్‌తో మంచిగ పంటలు పండించుకుంటున్నం. కేసీఆర్ సార్‌తోనే రైతుల బతుకులు బాగుపడుతానయి.

*– దేశిని కృష్ణ, రైతు, చిల్కోడు*

## నాడు పడ్డ తిప్పలు ఇంకా మరిచిపోలె..



నెల్లికుదురు : కాంగ్రెసోళ్లు నాడు కరెంట్ ఇవ్వక, ఇచ్చినా రెండు, మూడు గంటలు ఎప్పుడిస్తరో తెల్వక నాడు పడ్డ తిప్పలు ఇంక మరిపోలె. ఇప్పుడు మళ్ల 3 గంటల కరెంటు రైతులకు చాలంటున్నరు. ఎట్ల సరిపోతది? వాళ్లకు ఎద్దు, ఎవుసం గురించి తెలుసా? ఏసీ రూములల్ల కూసొని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే నడుస్తదా? ఇలాంటోళ్లను గెలిపిస్తే రైతులు ఆగం కావాల్సిందే. కేసీఆర్ పుణ్యమాని ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంట్‌తో పంటలు మంచిగ పండించుకుంటానం. రాత్రిళ్లు టార్చిలైట్లు పట్టుకుని నీళ్లు పెట్టాల్సిన పరిస్థితులు లేవు. 3 గంటల కరెంట్ చాలు..,10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొమ్మంటున్న కాంగ్రెసోళ్లకు ఓటుతో గట్టిగ బుద్ధి చెప్పాలె.

*– సలుగు శ్రీనివాస్, రైతు, నెల్లికుదురు*

## 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ అవుతున్నది..



నర్సింహులపేట: ధరణితో రైతుల భూములకు రక్షణ దొరికింది. నా భూమి వేరే వ్యక్తి పట్టా చేయించుకునే అవకాశం లేదు. ఎందుకంటే నేను రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి వేలు పెడితేనే మరొక వ్యక్తికి పట్టా అయ్యే అవకాశం ఉంటుంది. గతంలో రైతులు పట్టా చేయించుకోవాలంటే రోజుల తరబడి పట్వారీలు, తాసీల్దార్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎంత తిరిగినా మళ్లీ డబ్బులు ఇవ్వనిదే పని కాకపోయేది. ఎకరం భూమి కొనాలంటే పట్వారికి, తాసీల్దార్‌కే కనీసం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చయ్యేది. అయినా.. పట్టా బుక్కు అంత తొందరగా అందేది కాదు. ధరణి ద్వారా ఇప్పుడు రైతులకు అలాంటి ఇబ్బందులు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు వచ్చేది కాదు.. సచ్చేది కాదు. వాళ్ల దోపిడీ రాజ్యానికి రైతులు బలి కావాల్సిందే. ధరణితో ఏం ఇబ్బందులు లేకుండా నేరుగా రైతుబంధు డబ్బులు మా ఖాతాల్లో పడుతున్నాయి. మధ్యవర్తులు లేకుండా మేమే బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకుంటున్నాం. ధరణి ఉండాలె.. కేసీఆరే మూడోసారే ముఖ్యమంత్రి కావాలె..

*– ఆకుతోట నరేశ్, రైతు, నర్సింహులపేట*

## ధరణితోనే భూ సమస్యలు తీరినయ్..



కొత్తగూడ: తెలంగాణలోని రైతులకు భరోసా కల్పించిందంటే ధరణితోనే. గతంలో రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగలేక, లంచాలు ఇవ్వలేక ఇబ్బందులు పడ్డాం. కేసీఆర్ దయవల్ల ధరణి తేవడంతో మా భూములకు హక్కులు రావడమే కాకుండా రైతు బంధు కూడా అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు భూములను కబ్జాలు చేయాలనే ఉద్దేశంతోనే ధరణిని తీసేస్తాం అంటున్నరు. ధరణిని తొలగిస్తామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పాత రోజులు, కష్టాలు తప్పవు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ సార్ ఉంటరు.

*–తురుస భద్రయ్య, రైతు, కొత్తపల్లి, కొత్తగూడ*

## భూములు గోల్‌మాల్..



నెల్లికుదురు : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలు తీరి ఏ చింత లేకుండా ఉన్నం. గతంలో వాని భూమి వీనికి, వీని భూమి వానికి రాసి వీఆర్వోలు రైతులకు చుక్కలు చూపించిళ్లు. అప్పుడు వీఆర్వోలు, ఆర్ఐలదే రాజ్యం. పహాణీ కావాలన్నా, మ్యుటేషన్ కావాలన్నా ఏండ్లు గడుస్తుండే. ఆ లోపే ఆ భూమి వేరేటోని పేరున ఎక్కుతుండే. కాంగ్రెస్ హయాంలో ఇలాంటి కష్టాలు ఎన్నోపడ్డం. కేసీఆర్ ఎంతో ఆలోచించి తెచ్చిన ధరణితోనే భూ సమస్యలు తీరినయి. ఇవ్వాల భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒక్క రోజులోనే అయితాంది. నాడు భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే మహబూబాబాద్‌కు పోయేటోళ్లం. ఇప్పుడు మండల ఆఫీస్‌లోనే ఒక్క పైస లంచం ఇవ్వకుండా జరుగుతున్నయి. ధరణి ఉంటేనే మా భూములు సేఫ్.

*– దేశబోయిన శ్రీశైలం, రైతుబందు గ్రామ కో–ఆర్డినేటర్, మునిగలవీడు*

## ధరణి తీసేస్తే దళారుల రాజ్యమే..



మరిపెడ : ధరణిని తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. లంచాలు మొదలైతయి. రికార్డులు తారుమారు చేస్తరు. రైతులు ఆగమాగం అయితరు. సీఎం కేసీఆర్ ఆలోచనలో నుంచి పుట్టిన ధరణితో రైతులు వ్యవసాయ భూములకు భద్రత ఉన్నది. ఒక రైతు భూమిలో మరో రైతు వేలు పెట్టే అవకాశం లేదు. భూములన్నీ ధరణిల ఆన్‌లైన్ చేసినంక రైతుబంధు వంటి పథకాలు మంచిగ అందుతున్నయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధరణి తీసివేస్తామంటున్నారు. ధరణి పోతే దళారుల రాజ్యంతో మేము ఇబ్బందులు పడాలా? వాళ్ల మాటలు నమ్మలేం. ఇప్పుడు ఉన్నట్లే భూములు ఉండాలె. భూములకు రక్షణ కల్పించిన కేసీఆర్‌కు రుణపడి ఉంటం.

*– ముదిరెడ్డి వీరారెడ్డి, మరిపెడ*